# నాలుపోగు

ఒక రాత్రి సమయాన శాంతమ్మ కెందుకో గబుక్కున మెలకువ వచ్చింది. ప్రక్కకు వత్తిగిల్లుతూ కూతురు మంచం కేసి చూచింది. మంచం ఖాళీగా వుంది. శైలజ లేదు. ఒక్క క్షణం కంగారు పడింది. బాత్ రూంలో కేమయినా వెళ్ళి వుంటుందిలే అని మళ్ళీ అనుకుంది.

బెడ్‌రూం లైటు గ్రుడ్డి వెలుగులో గోడ గడియారం పన్నెండుంబావు చూపిస్తుంది. గదిలో ఒక్కటే వుక్కపోతగా వుంది. పైగా దోమల బాధ ఒకటి.

శాంతమ్మ కిద్దరు సంతానం. శైలజ రెండోది. పెద్దవాడు మోహన్ ఎమ్మే మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శైలజ బియ్యే ఆఖరు సంవత్సరం. ఆడపిల్ల అపటం వల్ల చూస్తుండగానే చెట్టంత ఎదిగిపోయింది. విరగబూచిన పూలచెట్టు లాగా అందంగా, గుమ్మటంగా వుంటుంది.

కళ్ళ నిండుగా గజ్జెల గుర్రంలాగా యింట్లో తిరుగుతుండే కూతుర్ని చూచినప్పుడల్లా శాంతమ్మ దీనికొక మంచి సంబంధం చూచి ఒక అయ్య చేతిలో పెట్టి ఎప్పటికి ఒక యింటిదాన్ని చేస్తామో? తామున్న గడ్డు పరిస్థితుల్లో ఇది జరుగుతుందా అని లోపల్లోపల దిగులుపడుతూ వుంటుంది.....

.... గడియారంలో ముళ్ళు మరో ఐదు నిమిషాలు ముందుకు జరిగినా శైలజ జాడ లేదు. లేచి చూద్దామనుకుంటూనే శాంతమ్మ బద్ధకించింది. బహుశా లెట్రిన్‌లోకి వెళ్ళి వుంటుందిలే అనుకుంది. ఇందాక పడుకోబోయే ముందు పాలు తోడేయమని చెప్పింది. వేసిందో లేదో. దీనికి ఏ మేనరికమన్నా కట్టబెట్టేసేపని కాని, అటువయిపూ, ఇటువయిపూ అందరూ ఆడముండలే! ఎన్నేసి వేలు కట్నాలు పొయ్యాలో, ఎక్కడెక్కడ వెతకాలో ఏంటో! దీనిదే దిగులయిపోయిందనుకుంది....

.... ఇలా ఆలోచిస్తుండగా మరో అయిదు నిమిషాలు గడిచిపోయింది గాని శైలజ మాత్రం అంతులేదు. దొడ్లో చెంబు చప్పుడు కూడా వినిపించడం లేదు. మరి ఇదెక్కడికెళ్ళినట్లు?

శాంతమ్మకు మనస్సులో ఏదో భయం పట్టుకుంది. మనస్సులో ప్రక్క పోర్షన్ వాళ్ల అబ్బాయి మొగం తటాలున సినిమా స్లైడ్ లాగా పడింది. వెధవది జులపాల క్రాపు - సన్యాసి ముండా కొడుకు లాగా గడ్డాలు మీసాలు పెంచాడు. పైగా వంకర నవ్వొకటి దొంగ వెధవ లాగా ఎప్పుడూ దొంగచూపులు చూస్తుంటాడు. శైలజ కనిపిస్తే చాలు వెధవ వళ్ళంతా కళ్ళు పెట్టుకొని చూస్తుంటాడు. తను చాలాసార్లు కనిపెట్టింది - ఈ శైలు బొంద కూడా వాడి వంక కళ్లప్పగించి చూస్తూంటుంది. మొన్న సాయంత్రం బయట గేటు దగ్గర స్తంభం లాగా నిలబడి, ఇది లోపలికి వస్తుంటే నిలబెట్టి మాట్లాడుతున్నాడు. ఇది

కూడా నవ్వుతూ ఏదో సమాధానం చెప్పుతూంది. లోపలికి రాగానే, 'వాడేంటే అంటాడు?' అని అడిగింది తను. 'వాడు ఎవరమ్మా?' బిత్తర పోయి అంది. తను చెప్పింది. 'ఆయనా?' అంది నవ్వుతూ. 'ఆయన' అంట ఆయన - సిగ్గులేకపోతే సరి.

శాంతమ్మకు ఇదంతా గుర్తుకు రావడానికి ఒక్క క్షణం కూడా పట్టలేదు. గుర్తుకు వచ్చిన మరుక్షణమే మంచం మీదనుంచి లేచింది. దొడ్డి తలుపు చూచింది. దొడ్డి తలుపు గడి వేసే వుంది. ఆమె గుండెల్లో పెద్ద బండ పడినట్లే అయింది.

.... కొంపదీసి ఇది వాడితో - అమ్మో అరి దేముడోయ్ ఇంకేమయినా వుందా!

కంగారుగా అక్కడ్నుంచీ వంటింట్లో కెళ్ళి చూచింది. శైలజ అక్కడా లేదు.

..... ఓరి దేముడోయ్, ఇదేదో చేసింది! ఎంత గుండెలు తీసిన బంటూ! ఎంతకు తెగించింది! వాడితో - ఛా ఛా.... నేనేం చేతునురా భగవంతుడా!

శాంతమ్మకు కాలూ చెయ్యీ ఆడటం లేదు. గుండెల్లో దడతో, వళ్ళంతా వణుకుతో, పరి పరి విధాలు పోయే మనస్సుతో ప్రక్క గదిలోకి వెళ్ళింది. అక్కడా లేదు. భర్త మాత్రం సుబ్బరంగా గురక పెట్టుతున్నాడు. ప్రక్క వేసిన మడత మంచం మీద కొడుకు మోహన్ ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

మెల్లగా భర్తను నిద్ర లేపింది.

సుబ్బరామయ్య కంగారుపడుతూ లేచి, లేచి కూర్చున్నాడు. "ఏంటే? ఏఁవయిందీ!"

ఏం చెపుతుంది - ఒక వయిపు నుంచి ఏడుపు ముంచుకొస్తోంది. "ఎలాగో, అమ్మాయి కనిపించటం లేదండీ!'' అంది మెల్లగా.

"దొడ్లోకెళ్ళిందేమోనే!''

"అన్నీ చూశానండీ!''

ఈ గొడవకు మోహన్‌కు మెలకువ వచ్చింది. తల్లిదండ్రుల గుసగుసల్ను బట్టి విషయమేమిటో అర్థమయింది. అతని మనస్సులో కూడా ఒక సినిమా స్లైడు పడింది. ఎదురు బంగ్ళాలో క్రొత్తగా దిగిన ఐ.ఎ.ఎస్. ఆఫీసరు గారి సుపుత్రుడు -

- గళ్ళ బుష్ షర్టూ, నల్లకళ్ళజోడూ పెట్టుకొని ఎప్పుడూ ఫోజుగా స్కూటర్ మీద తిరిగే 'పోజుల వెధవ' కనిపించాడు. మొన్నొకరోజు సాయంత్రం వాళ్ల డాబా మీద నిలబడి నవ్వుతూ చెయ్యి వూపుతున్నాడు. ఇటు చూస్తూ ఈ డాబా మీద శైలజ వుంది. చదువుతూ పచార్లు చేస్తుంది. శైలూ! ఏంటి అక్కడ అనగానే కంగారు పడిపోయింది.

ఈ వెధవ కొంపకు గేటు ఎప్పుడూ తీసే వుంటుంది. ఆ వెధవ మెల్లగా లోపలికి వస్తే, ఇది తలుపు తీసికొని మెల్లగా బయటికెళ్ళి ఆ నందివర్ధనం చెట్టు మాటున ఆ మూలలో, ఆ క్రీనీడలో.... ఛీ ఛీ! దీన్ని అసలు మర్డరు చేసేయాలి!

మోహన్ ఇలా ఆవేశంతో కుతకుత లాడుతుండగా శాంతమ్మా, సుబ్బరామయ్యా నడవాలోకి వెళ్ళి చూశారు.

వీధి తలుపు గడియ తీసి వుంది.

చేరగిల వేసి వున్న తలుపు చూడగానే సుబ్బరామయ్య మనసులో ఎడం పోర్షన్ ధర్మరాజు మొగం సినిమా స్లైడు లాగా పడింది. ముసలి నక్క ఏళ్లు రాగానే సరా! ఆడపిల్లలతో నవ్వులూ, జోకులూన్నూ? శైలజ వంక కళ్ళు ఇంతింత చేసుకొని చూస్తాడు. రాస్కేల్! ఆరోజు సాయంత్రం తను బజార్నుంచి లోపలకు వస్తుంటే వాళ్ళ పోర్షన్ నించి ఇది నవ్వుతూ బయటకి వస్తూంది. చేతిలో ఏవో ఇంగ్లీషు డ్రామా పుస్తకాలు, ఆ పుస్తకాల కోసం ఆ వెధవ దగ్గరికి పోతూ వుంటుంది. వెదవ 'ఎమ్మేలిట్' ఏడ్చాడుగా! అప్పుడు తన సిక్త్ సెన్స్‌లో ఏదో అనిపించగా "ఆంటీ లోపల లేదా అమ్మాయి?" అని ఎందుకో అడిగాడు. "లేదు, గుడి కెళ్ళింది." అంది. అయితే తను అనుకున్నంతా అయింది. పిల్లా పీచూ లేని వెధవ పైగా పెళ్లాం కూడా యింట్లో లేదు. దీనితో ఏ వంకర మాటలు మాట్లాడాడో, మరే తుంటరి చేష్టలు చేశాడో! తన కూతురు మీద వున్న నమ్మకంతో మనస్సును అప్పటికి ఎలాగో సరిపెట్టుకున్నాడు. ఆ నమ్మకాన్ని వమ్ము చేస్తూ ఇది ఈ అర్థరాత్రిపూట ఇలా తలుపు తీసికొని వాడితో.... ఛా ఛా - ఆపైన ఇక ఆలోచించలేకపోయాడు...

మెల్లగా, తలుపు నెట్టుకుని బయటికెళ్ళారు.

బయటంతా వెన్నెలా, చంద్రుడు ఆకాశానికంతా 'రాజు' లాగా వెలిగిపోతున్నాడు. చుట్టూతా చుక్కలూ - రాజుగారు సభ తీర్చినట్లే వుంది. ఈ వైభవాన్ని చెట్లూ చేమలూ, కొండలూ గుట్టలూ - మొత్తం ప్రకృతే నిలబడి చూస్తోంది. ఆఖరికి గాలి కూడా నిలబడి పోయింది.

ప్రకృతి అంతా ఇలా అందమైన పఠం కట్టి వుంటే ఆ తల్లిదండ్రులు వాళ్ల గొడవలో వాళ్లున్నారు.

అప్రయత్నంగా శాంతమ్మ జులపాల గుబురు క్రాపు వాడుండే కుడి పోర్షన్ వయిపు, సుబ్బరామయ్య ఆ ముసలినక్క ధర్మరాజుండే ఎడం పోర్షన్ వయిపూ వెళ్ళారు. ఆ పోర్షన్ల తలుపులు వేసే వున్నాయి.

అయినా అనుమానం తీరక చేత్తో నెట్టి చూశారు.

"పిల్ల ఏమయింది?" - శాంతమ్మ గుండెల్లో వణుకు!

'ఇది కొంప ముంచినట్లే వుందిరోయ్!' సుబ్బరామయ్యకు క్షణక్షణానికీ పెరుగుతూన్న బి.పీ.

ఇద్దరూ ఒకేసారి ప్రక్కగా చూశారు. పమిట చెంగుతో విసురుకుంటూ నూతి చప్టామీద పచార్లు చేస్తున్న కూతురు కన్పించింది.

ఆయన, "ఇక్కడేం చేస్తున్నావే?" గదమాయిస్తూ అడిగేడు.

వుసురస్సుమంటూ పమిట చెంగుతో విసురుకుంటూ, "లోపల వుక్క, ప్రాణం తీసేస్తోంది. పైగా దోమలొకటి! నిద్రపట్టక బయటున్నా కాస్త గాలి ఆడుతుందేమోనని పచార్లు చేస్తున్నా!" అంది.

"అఘోరించలేకపోయావు! లోపల గాల్లేదని అర్థరాత్రి పూట బయట ఒక్కదానివే పచార్లు చేస్తోన్నావా?" మళ్లీ కోపంగా అన్నాడు.

శైలజ ఏదో అనబోయింది. "చేసిన నిర్వాకం చాల్లే! నోరు మూసుకుని ఇక లోపలికి నడువ్!" అంది తల్లి కోపంగా.

అమ్మకూ, నాన్నకూ ఎందుకంత కోపం వచ్చిందో పాపం శైలజకు అర్థం కాలేదు. లోపల గాలిలేక నిద్రపట్టక వూరికే అలా తలుపు తీసికొని బయటికి వచ్చింది. ఇది చాలా మామూలు విషయం. దీనికింత రాద్ధాంతమా! ఇందులో అంత తప్పు పట్టవలసిన విషయమేముంది? వీళ్ళు ఇంత సీరియస్ అవవల్సిన అవసరమేముంది? పగలు పూట తనొక్కర్తే వూరంతా తిరిగి వస్తుంది. వుదయమెప్పుడో యింటి దగ్గర బయలుదేరి కాలేజీకి వెళ్లి మళ్ళీ ఏ సాయంత్రానికో తిరిగి వస్తుంది. ఈలోపల కిటకిటలాడే సిటీబస్సుల్లో, లోకల్ ట్రైన్లలో ప్రయాణం చేస్తుంది. అలాటిది ఇప్పుడు ఇలా తలుపు తీసకొని అలా గుమ్మం ముందున్న రెండు మెట్లు దిగేసరికి ఇంత రాద్ధాంతం చేస్తూన్నారెందుకో. పగలు వూరంతా తిరగవచ్చు. రాత్రుళ్ళు గుమ్మం దాటకూడదా? పగలకు రాత్రికీ వున్న భేదమేమిటో?

భుజాలెగరేస్తూ లోపలికి వస్తోన్న శైలజవంక మోహన్ కోపంగా చూశాడు.

ఇది జరిగిన వారానికే ఒక రాత్రి సమయాన సుబ్బరామయ్యకు మెలకువ వచ్చింది.

అప్పుడే బయట్నించి వచ్చి వీధి తలుపు వేస్తున్న మోహన్‌ను చూచి, "ఎక్కడి కెళ్ళావురా అబ్బాయి?" అన్నాడు.

"వుక్కకి నిద్ర పట్టకపోతే వూరికే అలా బయట పచార్లు చేసి వస్తున్నాను".

సుబ్బరామయ్య ఇంకేం మాట్లాడలేదు. మళ్ళీ గురకపెట్టి నిద్రపోసాగాడు.

శైలజకు అప్పుడే మెలకువ వచ్చింది. వీళ్ల సంభాషణ విన్నది.

మొన్న తను బయటికెళ్ళితే అంత రాద్ధాంతం చేసిన తండ్రి ఇప్పుడు అన్నయ్యను ఏమీ అన్లేదు ఎందుచేత? గాలి మొగవాళ్ళకే కావాలా? ఆడవాళ్ళకి అక్ఖర్లేదా? వుక్కపోత ఎవరికైనా ఒక్కటే! రాత్రిపూట ఆడపిల్ల తలుపు తీసి గాలికోసం గుమ్మంలో కూర్చుంటే అది పెద్ద నేరమా? అదే మొగవాడు చేస్తే ఏమి అనరా. ఎక్కడుందీ తేడా. ఇలా ఆలోచిస్తోంది.

పడుకున్నాడన్న మాటే గాని మోహన్‌కు నిద్రపట్టి చావటం లేదు. ఇంకా ప్రక్కింటి ప్లీడరు గారి మరదలు నున్నటి చెంపలూ, మెడ క్రింద పౌడరు వాసనా, జడలో నలిగిపోయిన మల్లెదండ వింత పరిమళమూ, చెవులో గుసగుసలూ, వాళ్లింటి నైట్‌క్వీన్ చెట్టు పరచిన నీడ - పాన్పు గుర్తుకు వస్తోన్నాయి.

- 'ప్రభవ' మాసపత్రిక 1978

★